క్లుప్తంగా

బాల్య దశలో నుంచే విద్యపై ఆసక్తి పెంచాలి



డ్రాయింగ్‌లను ప్రదర్శిస్తున్న ఎంఈఓ-2 శోభారాణి

కోసిగి: అంగన్‌వాడీ కేంద్రాలలో బాల్యదశ నుంచే విద్యాభ్యాసంపై పిల్లల్లో ఆసక్తి పెంచేలా కృషి చేయాలని ఎంఈఓ - 2 శోభారాణి సూచించారు. గురువారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడవ రోజు శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, రీసోర్స్‌పర్సన్స్ కె.నరసయ్య, ఎస్. మనోహర్, ఈరన్న, ఐసీడీఎస్ సూపర్ వైజర్స్ భాగ్యలక్ష్మీ బాయి, కాత్యాయినిలు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కస్తూర్బా స్పెషల్ ఆఫీసర్ షబానా అజ్మీ, కార్యకర్తలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం

నందవరం : మండల పరిధిలోని మిట్టసోమపురం గ్రామంలో గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో 6 గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామంలో చెత్త సంపద తయారీ కేంద్రం సమీపంలోని పప్పుగుత్తి రామప్ప స్థలం, ఆరేకంటి కేశన్న స్థలంలో పశువుల మేత కోసం పాడి రైతులు బెస్త రామలింగడు-3, ఆరేకంటి నాగరాజు-1, ఆరేకంటి పురుషోత్తం -1, తెలుగు నాగరాజు-1 చొప్పున 6 గడ్డివాములు వేసుకున్నారు. గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పక్క పక్కనే ఉన్న గడ్డివాములకు మంటలు వ్యాపించాయి. స్థానికులు ఆర్పేందుకు యత్నించినా వీలుకాలేదు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. పశువుల మేత కోసం రూ.2 లక్షలు ఖర్చు వేచించి గడ్డివాములు వేసుకున్నామని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు నేడు ఇంటర్వ్యూలు

గోనెగండ్ల : బీసీ కార్పొరేషన్‌లో సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మణిమంజరి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధించిన ధ్రువపత్రాలు తీసుకొని హాజరు కావాలన్నారు. అలాగే శనివారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు సంబంధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ ఉందని చెప్పారు.

దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దర్గా పరిసరా ప్రాంతాలన్ని భక్తులతో సందడిగా మారాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

ఉరుకుంద ఆలయ రిటైర్డ్ ప్రధాన అర్చకుడి మృతి



జె.కె.వీరన్న (ఫైల్)

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయం మొట్టమొదటి ప్రధాన అర్చకుడు జె.కె.వీరన్న (80) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయనకు భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. దేవాలయానికి సుమారు 40సంవత్సరాల పాటు సేవలు అందించారు. ఆయన మృతి పట్ల ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు సంతాపం తెలిపారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, ఉప ప్రధాన అర్చకుడు మహదేవ స్వామి, అర్చకులు, ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు సంతాపం తెలిపారు.

బట్టల దుకాణంలో చోరీ

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని షరాఫ్ బజార్‌లో రెడీమెడ్ బట్టల దుకాణంలో చోరీ జరినట్లు పట్టణ పోలీసులు గురువారం తెలిపారు. బట్టల దుకాణంలో షర్ట్స్ కోనుగోలు చేసేందుకు వచ్చిన మహిళలు పిల్లలను ముందు పెట్టి వెనుకనుంచి చోరీకి పాల్పడిన దృశ్యాలు సీసీ ఫుటేజ్‌లో నమోదు అయ్యాయి. సుమారు 60 అంగీలను దొంగిలించారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా ఇద్దరు మహిళలు చోరీకి పాల్పడినట్లు నిర్ధారించినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. మహిళలను విచారిస్తున్నామని చెప్పారు.

సూపర్‌సిక్స్ అమలులో విఫలం

ఎమ్మిగనూరుటౌన్: సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏపీ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి యు.ఈరమ్మ ఆరోపించారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టి.. సూపర్‌సిక్స్ పేరుతో ఆశ చూపి ఇప్పుడు వాటిని అమలు చేయక మోసం చేశారని ఆరోపించారు. సమావేశంలో సమాఖ్య నాయకులు చాముండి, రేణుక, లక్ష్మి, నాగవేణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక

- హెచ్ కైరవాడిలో అల్లీసాహెబ్ దర్గా ప్రాంగణంలోనే ఎల్లమాంబదేవి ఆలయం
- కులమాతాలకు అతీతంగా దర్గాలో ప్రార్థనలు, ఆలయంలో పూజలు
- రేపటి నుంచి ఉరుసు
- స్వామికి ఇసుక సమర్పిస్తే కోరికలు తీరుతాయని నమ్మకం



స్వామి వారి దర్గా, పక్కనే ఉన్న ఎల్లమ్మ దేవాలయం

గోనెగండ్ల : మండల పరిధిలోని హెచ్ కై రవాడి గ్రామంలో వెలసిన అల్లిసాహెబ్ దర్గా మతసామర్యానికి ప్రతీకగా నిలుస్తోంది. దర్గా ఆవరణలో ఎల్లమాంబదేవి దేవాలయం ఉండటంతో భక్తులు దర్గాలో ప్రార్థనలు చేసి, ఆలయంలో పూజలు చేయడం ఆనవాయితీ. గ్రామంలో అన్ని మతాలవారు ప్రార్థనలు, పూజలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామంలో ఈనెల 22 నుంచి అల్లిసాహెబ్ స్వామి ఉరుసు మహోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

భక్తితో ఇసుక సమర్పిస్తే కోర్కెలు తీర్చే స్వామి

హెచ్ కై రవాడి గ్రామంలో వెలిసిన అల్లిసాహెబ్ స్వామి వారికి భక్తులు వినూత్నతంగా ఇసుకను సమర్పిస్తారు. గ్రామ సమీపంలో ఉన్న హంద్రీలోని ఇసుకను ఎద్దుల బండితో తొలించి స్వామి వారికి సమర్పించి కోర్కెలు కోరుకుంటారు. వచ్చే ఏడాదిలోను తమ కోర్కెలు తీరుతాయని గ్రామస్తుల నమ్మకం. దీంతో గ్రామంలోని భక్తులతో పాటు ఇతర గ్రామాల భక్తులు ఎద్దుల బండ్లతో ఇసుకను స్వామి వారికి సమర్పిస్తారు. చల్లని ఇసుకను సమర్పిస్తే స్వామి చల్లంగా చూస్తాడని నమ్మకం. ఇది ఎన్నో ఏళ్లుగా వస్తున్న ఆచారమని గ్రామపెద్దలు చెబుతున్నారు.

భేదాభిప్రాయాలు లేకుండా ఆదర్శంగా..

ఈ దర్గా ప్రాంగణంలోనే ఎల్లమాంబదేవి దేవాలయం ఉంది. ప్రతి రోజు భక్తులు దర్గాలో ప్రార్థనలు చేసి ఎల్లమాంబ దేవాలయంలో పూజలు కూడా చేస్తారు. గత 40 ఏళ్లుగా మాఘమాసంలో జరిగే అల్లిసాహెబ్ స్వామి ఉరుసు సందర్భంగా భక్తులు మొక్కలు తీర్చుకుంటారు. అలాగే దర్గా పక్కనే ఉన్న ఎల్లమ్మ దేవాలయంలో కూడా పూజలు నిర్వహిస్తారు. దర్గా దేవాలయం పక్కపక్కనే ఉన్నప్పటికీ ఎటువంటు భేదాభిప్రాయలు లేకుండా రెండు వర్గాల వారు ప్రార్థనలు, పూజలు నిర్వహిస్తూ మిగతా గ్రామాల్లోని ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



అల్లిసాహెబ్‌స్వామి జీవ సమాధి

రేపు గంధోత్సవం

గ్రామంలో ఈనెల 22 నుంచి అల్లిసాహెబ్ స్వామి ఉరుసు మహోత్సవాలు జరగనున్నాయి. 22న స్వామివారి గంధం, 23న ఉరుసు మహోత్సవం, 24న కిస్తీ కార్యక్రమాలతో ఉరుసు వేడుకలు ముగుస్తాయి. కైరవాడి గ్రామంలో జరిగే అల్లిసాహెబ్ ఉరుసు మహోత్సవ వేడుకలు కులమతాలకు అతీతంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొంటారు. మతసామరస్యానికి ప్రతీకగా హిందు, ముస్లిం, క్రిస్టియన్ అనే భేదం లేకుండా ఉరుసు, జాతర్లల్లో పాల్గొని మొక్కులు తీర్చుకుంటారు.

ఘనంగా బంగి అయ్యప్ప తాత ఉరుసు



ప్రత్యేక అలంకరణలో దర్గా

కోసిగి: మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామంలో కులమతాలకు అతీతంగా భక్తులు భక్తి శ్రద్ధలతో బంగి అయ్యప్ప తాత ఉరుసును ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం గ్రామంలో భక్తులు మొక్కుగా ప్రతి ఇంటి నుంచి పుష్పాలతో ఊరేగింపుగా దర్గా చెంతకు చేరుకుని స్వామివారికి సమర్పించారు. దర్గా వద్ద ప్రత్యేక ఫతేహాలు నిర్వహించి పూజలు చేసుకున్నారు.



దర్గా వద్ద ఊరేగింపుగా పూలు, నైవేద్యం తీసుకెళ్తున్న భక్తులు

చట్టాలను తెలుసుకోవాలి



మాట్లాడుతున్న ఆదోని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ఎల్.సాయిసుభాష్

ఆదోని రూరల్: ప్రజలు చట్టాల గురించి తెలుసుకోవాలని ఆదోని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ఎల్.సాయిసుభాష్ అన్నారు. గురువారం పట్టణంలోని కార్వన్‌పేటలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సామాజిక న్యాయం గురించి, జాతీయ లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారం గురించి ప్రజలకు వివరించారు. ప్రజలందరికీ సామాజిక న్యాయం అందాలని, విద్య ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. లింగబేధం లేకండా పిల్లలందరినీ సమానంగా చూడాలని, వారికి మంచి విద్యను అందించాలని సూచించారు. మార్చి 8న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ కాదగిన కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు నాగరాజు, లోకేష్‌కుమార్, ట్రాఫిక్ స్టేషన్ ఎస్ఐ గోపాల్, ఆర్ఐ ఖాసీం పాల్గొన్నారు.

అక్రమసారా నిర్మూలనే ధ్యేయం



సైదుల్లా, ఎక్సైజ్ సీఐ

ఆదోని రూరల్: అక్రమసారా నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, అందుకు ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పని చేస్తుందని ఆదోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సైదుల్లా అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నాటుసారా, అక్రమ సారా రవాణా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఇందులో రెవెన్యూ, పోలీసు, అటవీ, ఇతరశాఖల అధికారుల సహకారంతో మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రతిరోజూ నాటుసారా, అక్రమ సారా తరలింపుపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. అక్రమ మద్యం సరఫరా, నాటుసారా తయారు చేసే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసి, జిల్లా బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు.

ఎల్ఐసీలో నూతన నియామకాలు చేపట్టాలి



సమ్మెలో పాల్గొన్న ఎల్ఐసీ ఉద్యోగ సంఘం నాయకులు

ఆదోని రూరల్: ఎల్ఐసీలో నూతన నియామకాలు చేపట్టాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ఆదోని బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి రవిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద సంస్థ ఉద్యోగులు గంట పాటు సమ్మె చేపట్టారు. ఆయన మాట్లాడుతూ జవాబుదారీతనం లేని ఔట్‌సోర్సింగ్ స్థానంలో సాధారణ నియామకాలే పరిష్కారమన్నారు. యూపీఎస్‌సీ తరహాలో ప్రతిఏటా ఎల్ఐసీలో అవసరమై నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ధర్మరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాధకృష్ణ, సీఐటీయూ నాయకులు ఈరన్న, తిప్పన్న, ఎల్ఐసీ ఏజెంట్ లియాఫీ, సిద్ధలింగ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ కొత్తగా నియామకాలు చేపట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: గతేడాడి ఎల్ఐసీ సంస్థలో 15వేల మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారని, అందువలన కొత్తగా నియామకాలు చేపట్టాలని ఎల్ఐసీ బ్రాంచ్ ఉద్యోగుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, విజయ్‌కుమార్, నాయకులు రాము, రఘునాథ్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బ్రాంచ్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘ నాయకులు మహేష్‌కుమార్, ప్రతాప్‌కుమార్, రామకృష్ణ, సీఐటీయు నాయకులు రాముడు, లియాఫి బ్రాంచ్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిరప రైతులను ఆదుకోవాలి

కోసిగి: మిరప రైతులను ఆదుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్ కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మిరప రైతులు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కోసిగి మండలంలో వందలాది మంది రైతులు మిరప పంట సాగు చేసుకుని గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎకరాకు పెట్టుబడి రూ.2లక్షల వరకు ఖర్చు చేసుకున్నారని, కనీసం పెట్టుబడి రాకపోగా అప్పులు మిగిలిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మిరప పంటకు బీమా సౌకర్యం కల్పించి, ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ రుద్రగౌడకు అందించారు. రైతు సంఘం నాయకులు పూజారి శ్రీనివాసులు, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, మిరప రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఎమ్మిగనూరురూరల్: బాల్య వివాహాలను చేయడంతో పాటు వాటిని ప్రోత్సహించడం కూడా చట్టరీత్యా నేరమని తహసీల్దార్ శేషఫణి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, సీడీపీఓ సఫర్నీసాబేగం, రూరల్ సీఐ మధుసూదన్‌రావు, ఎంఈఓలు ఆంజనేయులు, మధుసూదన్‌రాజు, ఆర్డీటీ ఆదినారాయణ అన్నారు. గురువారం మండల పరిషత్ సమావేశ భవనంలో సీడీపీఓ సఫర్నీసాబేగం ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై పాఠశాల హెచ్ఎంలు, మహిళా పోలీసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ ఉందని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు మీ దృష్టికి వస్తే వెంటనే వారి తల్లిదండ్రులకు నచ్చజెప్పి మైనార్టీ తీరాక పెళ్లిళ్లు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు పూర్తి అయ్యేవరకు పెళ్లి చేయరాదని తెలిపారు. బాల్యవివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. సమావేశంలో పూజాలు, చర్చి ఫాదర్స్, ముస్లిం పెద్దలు, హెచ్ఎంలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ముగిసిన అన్నదానం



పాదయాత్ర వెళ్లే భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: మహాశివరాత్రి పండగను పురస్కరించుకుని పుణ్యక్షేత్రమైన శ్రీశైలానికి పాదయాత్ర వెళ్లే భక్తుల కోసం పట్టణ శివారులోని ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డులో దాతల సాయంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం గురువారంతో ముగిసింది. నిర్వాహకుడు అల్కూరిమఠం మహర్షి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు అన్నదానం వితరణ చేశారు. కార్యక్రమానికి ఓబీసీ మోర్చా అధ్యక్షులు మలేకర్ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి గిరిజ వాణి, వీరశైవ యువక సంఘం గౌరవాధ్యక్షుడు మంజునాథ్, ప్రముఖులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ధి

ఆదోని అర్బన్: సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేద ప్రజలకు ఉపయోగపడుతుందని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. గురువారం ఆదోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం ఖర్చు పెట్టుకున్న వారికి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. పింజారిగేరికి చెందిన సయ్యద్ ఖాన్‌కు రూ.3.65 లక్షలు చెక్కును అందించారు.

కంటి అద్దాల పంపిణీ

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు కంటి చూపు పట్ల జాగ్రత్తగా వుండాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని సోగ నూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా కంటి లోపాలున్న వారికి గురువారం కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యావతి, జిల్లా అధికారి సంధ్యారెడ్డి, ఎంఈఓ- 2 మధుసూదన్‌రాజు, హెచ్ఎం రఘు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టాలి

ఆదోని టౌన్: పట్టణంలోని సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టాలని బీజేపీ కర్నూలు జిల్లా అధికార ప్రతినిధి ఆదూరి విజయ్‌కృష్ణ మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణను కోరారు. గురువారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో 60 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా.. కేవలం 5 మాత్రమే సక్రమంగా పనిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రమాకాంత్, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

హాల్ టికెట్లు ఇవ్వాలి

ఆదోని సెంట్రల్: ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎటువంటి షరతులు లేకుండా హాల్ టికెట్లు ఇవ్వాలని డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ధనాపురం ఉదయ్, డివిజన్ కార్యదర్శి వినల్ డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ పండిన పంటలకు గిట్టు బాటు ధరలేక ఆర్థికంగా రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో డీఎస్ఎఫ్ నాయకులు నవీన్, వరుణ్, జానబాబు, హరికృష్ణ, విక్రం తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీలను మినహాయించాలి

ఆదోని సెంట్రల్: ఇన్విజిలేటర్, స్పాట్ డ్యూటీల నుంచి ఎస్‌జీటీలకు మినహాయింపు ఇవ్వాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరావు, రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్ డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ ఒకరు ఇద్దరు పని చేసే పాఠశాలల్లోని ఉపాధ్యాయులను స్పాట్ డ్యూటీలకు పంపిస్తే ప్రాథమిక స్థాయిలో విద్యాబోధన కుంటుపడుతుందని చెప్పారు.

బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం

ఎమ్మిగనూరుటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు నిధులు కేటాయించకుండా ద్రోహం చేసిందని సీపీఎం నాయకులు గోవిందు, రాముడు ఆరోపించారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. నాయకులు అబ్దుల్లా, సురేష్, తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అండగా ఏపీడబ్ల్యూజేఎఫ్



సభ్యత్వ నమోదు దరఖాస్తు స్వీకరిస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

ఆదోని టౌన్: రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కులను కాపాడటంతో పాటు వారికి అండగా ఉండడమే ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ లక్ష్యమని ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి అన్నారు. గురువారం పట్టణంలోని భీమాస్ ఫంక్షన్ హాల్‌లో ఆదోని నియోజకవర్గ అధ్యక్షుడు బసవరాజు అధ్యక్షతన ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు సకాలంలో అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేసి ప్రభుత్వమే గృహం నిర్మించేలా చూడాలన్నారు. హెల్త్‌కార్డులకు ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలన్నారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడే వారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రతిఒక్కరూ ఫెడరేషన్‌లో సభ్యత్వం తీసుకోవాలని జర్నలిస్టులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి మునెప్ప, ఉపాధ్యక్షులు ఉరుకుందప్ప, మురళి ఉన్నారు.

అశ్వగంధ సాగు లాభదాయకం



అశ్వగంధ విత్తనాలను అందజేస్తున్న అధికారులు

ఎమ్మిగనూరురూరల్: రైతులు వర్షాధార పంట కింద అశ్వగంధ సాగు చేయడం లాభదాయకంగా ఉంటుందని కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్రచౌదరి, జాతీయ ఔషధ మొక్కల బోర్డు సీనియర్ శాస్త్రవేత్త జ్ఞానేష్, ఆయూష్ మెడికల్ ఆఫీసర్ స్వర్ణలత తెలిపారు. గురువారం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో అశ్వగంధ పంట సాగుపై ఒక్క రోజు శిక్షణ ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ 160 రోజుల్లో పంట కాపుకు వస్తుందని, చీడ, పీడ, పురుగుల బెడద ఉండదని తెలిపారు. నల్లరేగడి, ఎర్ర నేలలు విత్తడానికి అనుకూలమని, జూన్, జూలై విత్తుకోవాలని చెప్పారు. అశ్వగంధ మొక్క కిలో వేరును బట్టి ఎకరాకు 10 వేల నుంచి 15 వేల మొక్కలు వస్తాయన్నారు. రైతుకు ఎకరాకు రూ. 60 వేలు ఆదాయం వస్తుందని తెలిపారు. పంటను కోనుగోలు చేసేందుకు బోర్డును ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం రైతులకు అశ్వగంధ విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారి రామచంద్రుడు, కేవీకే శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.



ముగతిలో శివస్వాములను కలశాలతో శ్రీశైలానికి సాగనంపుతన్న చిన్నారులు

కాలినడకన శివ సన్నిధికి..

నందవరం: శివ దీక్ష చేపట్టిన శివస్వాములు ఇరుముడి ధారణ గావించి కాలినడకన శివుడి చెంతకు పయనమయ్యారు. నిత్యం శివ ధ్యానంలో తరించిన స్వాములు శివరాత్రిని పురస్కరించుకుని శ్రీశైలానికి కాలినడకన బయలు దేరారు. మండల కేంద్రం నందవరంతో పాటు ముగతి గ్రామ శివస్వాములు గురువారం గ్రామ శివాలయాల్లో పడి, ఇరుముడి పూజలు గావించి అభిషేకాలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులు స్వాములకు ఊరేగింపు నిర్వహించి పూలమాలలు వేసి, దారి పొడవునా జలాభిషేకాలు చేసి సాగనంపారు. గురుస్వాములు ఈరన్న, భీమన్న, దేవేంద్రరెడ్డి చేతులు మీదుగా ఇరుముడి ధారణ గావించారు. గురుస్వాములు లింగమూర్తి, మల్లేష్, నరసింహులు, శ్రీరాములు ఆధ్వర్యంలో ఊరేగింపు చేపట్టారు.

భక్తులకు సౌకర్యాల కల్పనలో విఫలం

ఆదోని అర్బన్: శ్రీశైలం పుణ్యక్షేత్రం దర్శనానికి వెళ్లే భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో దేవదయ, అటవీశాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని బీజేపీ అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజుగౌడ్ ఆరోపించారు. గురువారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శ్రీశైలం దేవస్థానానికి కోట్లాది రూపాయలు ఆదాయం ఉన్నప్పటికీ భక్తులకు క్షేత్రంలో కనీస సౌకర్యాలైన తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. సమావేశంలో మహాదేవ్, నాగార్జున, వేణుగోపాల్, ఉషారాజ్, వడ్డే రాము తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఆదోని అర్బన్: మండలంలోని బసాపురం గ్రామానికి చెందిన అడివేష్ అనే వ్యక్తి పంచాయతీరాజ్ డీఈ రాణిని బెదిరించడంతో కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ తిరుపాల్ గురువారం తెలిపారు. బసాపురం గ్రామంలో జరిగిన పనులపై ఆమెను గ్రామానికి పిలిపించి, పనుల్లో అవినీతి జరిగిందని బ్లాక్ మెయిల్ చేశాడన్నారు. పంచాయతీరాజ్ డీఈ ఫిర్యాదు మేరకు అడివేష్‌పై కేసు నమోదు చేశామన్నారు.

డీఎస్సీలో ప్రాధాన్యత ఇవ్వాలి

గోనెగండ్ల : ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు రాబోవు డీఎస్సీలో ప్రాధాన్యత మార్కులు కేటాయించాలని సీఆర్‌ఎంటీ పుల్లన్న డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మండల విద్య వనరుల కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు ప్రాధాన్యత మార్కులు సంవత్సరానికి ఒక మార్కు చొప్పున గరిష్ఠంగా 10 మార్కులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు కవిత, విజయరాణి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందజేస్తున్న దాతలు

ఆదోనిటౌన్: మండంలోని పెద్దహరివాణం పీహెచ్‌సీ పరిధిలో క్షయవ్యాధి (టీబీ) బాధితులకు గురువారం పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. వైద్యులు షేకున్ బాను, ఇమ్రాన్‌అహ్మద్, ఎంపీహెచ్ఈఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా దాతలు భాస్కర్, వీరేషల ఆధ్వర్యంలో కిట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు.